క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత

డాక్టర్ మంజుల



యోగాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మంజుల

మంచాల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జాపాల ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు జి.మంజుల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జాపాల పంచాయతీ కార్యాలయం వద్ద యోగాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. దీంతో రుగ్మతలు దరిచేరవన్నారు. యోగాను నిత్యకృత్యంగా అలవర్చుకోవాలని సూచించారు. జాపాల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వద్ద రోజు ఉదయం యోగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు యోగాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ సింగారం భాస్కర్, ఎస్‌ఎన్‌ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

యాచారం: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పారిశ్రామిక మంత్రిత్వ శాఖ, గ్రామీణా పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అలీప్(అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా) సంయుక్తంగా మహిళల స్వావలంబన కోసం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, విస్తరణ అధికారి వసంత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు నర్సింలు, సెర్ప్ ఏపీఎం సాంబశివుడు. కిరణ్ పాల్గొన్నారు.

ఎరువులను మోతాదులో వాడాలి



నానక్‌నగర్ రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ

యాచారం: పంటల సాగులో ఎరువులను మోతాదులో వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ అన్నారు. మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల సాగు లో ఎరువులను మోతాదులో వాడాలని.. లేని పక్షంలో భూసారానికే ప్రమాదకంగా మారుతు ందని అన్నారు. విత్తనాలు, ఎరువులు కొను గో లు సమయంలో వ్యాపారుల వద్ద రశీదులు తీ సుకోవాలని సూచించారు. కర్షకులంతా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, విస్తరణ అధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళ్తే బెదిరించారు

ఇబ్రహీంపట్నం రూరల్: తమ పూర్వికుల సమాధులను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టేషన్‌కు వెళితే.. పోలీసులు తమను బెదిరింపులకు గురిచేశారని బేడబుడగ జంగాల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో కొద్ది రోజుల క్రితం రాత్రికిరాత్రే చెరువు కట్టను తవ్వి, తమవారి సమాధులను ధ్వంసం చేశారన్నారు. దీనిపై కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇదే విషయమై ఎస్‌ఐ వెంకటేశ్‌ను కలిసి ఫిర్యాదు చేయగా పరుషపదజాలంతో తిట్టారని వారనాసి అంజయ్య, నిదనకవి జంగయ్య, రంగప్ప, నిదనకవి రాములు తదితరులు తెలిపారు. సమాధులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ఆరోపణలు: ఎస్‌ఐ వెంకటేశ్

ఇదే విషయమై ఎస్‌ఐ వెంకటేశ్‌ను వివరణ కోరగా వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. కేవలం ఫొటోలు మాత్రమే అడిగానని చెప్పారు. సీసీ కెమెరాల్లో నిజానిజాలు బయటకు వస్తాయన్నారు.

వనమహోత్సవానికి సన్నద్ధం

24 గ్రామాల నర్సరీల్లో మొక్కలు సిద్ధం

- గ్రామానికి పదివేల చొప్పన నాటేందుకు ప్రణాళికలు
- ఔషధ మొక్కలతో పాటు పండ్లు, పూలు, నీడ నిచ్చే మొక్కల పెంపకానికి కార్యాచరణ



కడ్తాల్ నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

కడ్తాల్: రాష్ట్రంలో అడవుల శాతం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామాల్లో పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో మొక్కలు నాటేందుకు మండలంలో అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాల గుర్తింపు, గుంతలు తీయడం లాంటి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికల ప్రకారం ముందుకెళ్తున్నారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో వనమహోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుండటంతో అందుకు అనుగుణంగా అధికారులు మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.

రెండు రోజుల్లో గుంతలు

మండల పరిధిలోని 24 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి 10వేల చొప్పున మొక్కల పెంపకం చేపట్టారు. నర్సరీల్లో సిద్ధంగా ఉన్న 2.40లక్షల మొక్కలను నాటి సంరక్షించి గ్రామాల్లో హరితశోభను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం పనులను పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పర్యవేక్షించగా.. ఈజీఎస్ అధికారులతోపాటు, ఎంపీడీఓ, ఎంపీఓ, ఈజీఎస్ ఏపీఓ తదితరులు తరుచూ సందర్శిస్తూ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ముందస్తుగా ముసురు వస్తుండడంతో మరో రెండు రోజుల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటేందుకు వీలుగా గుంతలు తీసే పనులు చేపట్టనున్నారు. ఇంటింటికి పంపిణీ చేసే పూల, పండ్ల మొక్కలను సిద్ధం చేశారు. ఉసిరి, చింత, మునగ, నిమ్మ, జామ, కర్జూర, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, వెలగ, గులాబీ, టేకు, వేప, కానుగ, రేగు, మందారం, పచ్చగన్నేరు, గోరింటాకు, బాదం, గుల్‌మోర్, మల్లె తదితర మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాం. ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేందుకు వీలుగా ఖాళీ స్థలాల్లో గుంతలు తీసి, గ్రామాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేస్తాం. రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాలలో, రైతులకు అవసరమయ్యే మొక్కలు, ఇంటి ఆవరణలో నాటే మొక్కలను సిద్ధం చేశాం. నిర్ధేశించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేస్తాం. – సుజాత, ఎంపీడీఓ, కడ్తాల్

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

హయత్‌నగర్: ఆపరేషన్ కగార్ పేరిట ప్రభుత్వం అమాయక గిరిజనులను పొట్టనబెట్టుకుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన కుంట్లూరులోని రాజీవ్‌గృహకల్ప సీపీఐ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి చర్చలకు మావోయిస్టులు ముందుకు వస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకుండా కాల్పులు జరపడం అప్రజాస్వామికమన్నారు. వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమసమాజ స్థాపనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల జీవితాలలో మార్పు రావడం లేదని అవినీతిని, ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి హరిసింగ్ నాయక్, ప్రజా నాట్యమండలి నాయ కులు గణేష్, రాము, వెంకటేష్, బాబు, వలి, నర్సి ంహ, శ్రీను, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న రవీంద్రాచారి

ఉనికి కాపాడుకునేందుకే ఆరోపణలు



రైతులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: ఉనికి కాపాడుకునేందుకే బీఆర్‌ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. తడిసిన ధ్యాన్యం సైతం కొనుగోలు చేస్తామని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయించాలని, రైతులను ఇబ్బందులు పెట్టవద్దని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ధర్నా చేయడం సిగ్గుచేటు అన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు రైతులను రెచ్చగొట్టి ధర్నాలు చేయించడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులు తమ ఉనికి కాపాడుకోవడానికి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు రైతు సంక్షేమాని విస్మరించాయన్నారు. మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు 1.36 లక్షల బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ డైరెక్టర్లు పాండురంగయ్య, శ్రీశైలం, అంజయ్య, వెంకట్‌రెడ్డి, జంగయ్యగౌడ్, అజీం, రమేశ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు పర్వతాలు, వెంకటేశ్, అనిల్, గౌస్, విజేందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన పద్మ బాలరాజు మంగళవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుక్ను మాజీ సర్పంచ్ శ్రీశైలం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం సంయుక్తంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఓ నాయకులు కోరారు. పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం టీఎస్ఎస్ఓ నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించాలని.. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

భవన నిర్మాణ సంఘం నూతన కమిటీ

తుర్కయంజాల్: కార్మికుల శ్రమ లేకుండా దేశ ప్రగతి లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని.. నెలకు రూ.7,500 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేటి ప్రభుత్వాలు పోరాటాలను, ప్రశ్నించడాన్ని సహించలేకపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భవన నిర్మాణ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా ఎస్.దేవ నాయక్, సహాయ కార్యదర్శిగా నాగేశ్వర రావు, కార్యవర్గ సభ్యులుగా హనుమంత్, శంకర్ నాయక్, రాములు, లక్ష్మి, నీల, విజయ, కోట్యా నాయక్, నరసింహలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగిరం చేయండి

ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ

యాచారం: అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి పనులు, గ్రామాల్లో తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని 24 పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. నింబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని, లేదంటే బిల్లులు అందవని లబ్ధిదారులకు వివరించాలన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, పైపులు లీకేజీలు కాకుండా చూసుకోవాలన్నారు. ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సింగంపల్లి కార్యదర్శిపై చర్యలకు వినతి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సింగంపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు: మండల పరిధిలోని సింగంపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అంజయ్యను రిలీవ్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు పోలేపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, సింగంపల్లి మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ పోచాలు ఆధ్వర్యంలో వందమంది గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్‌లో ట్రెయినీ కలెక్టర్, డీపీఓలకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి జంగయ్య విధులకు సక్రమంగా హాజరవడం లేదని.. గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని.. నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు వివరించారు. ఆయనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పోరాటం



కడ్తాల్: పోలీసుల అదుపులో లక్ష్మీనర్సింహారెడ్డి



ఇబ్రహీంపట్నం: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి, యాదగిరి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించేవరకు పోరాటం ఆగదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సంఘం మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాది కావొస్తున్నా నేటికి ప్రభుత్వం సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. సమస్యలపై పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

ఇబ్రహీంపట్నం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే అక్రమంగా ముందస్తులు అరెస్ట్ చేయడం సరికాదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి అన్నారు. సంఘం పిలుపుమేరకు మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడి నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు తులేకలాన్, రాయపోల్ మాజీ సర్పంచ్‌లు యాదగిరి, బల్వంత్‌రెడ్డి ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బల్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,200 కోట్ల బకాయిలకు రూ.153 కోట్లు మంజూరు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదని విమర్శించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కొంగరతండాలో చెత్త తొలగింపు



కొంగరతండాలో చెత్త తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగర తండాలో పేరుకుపోయిన చెత్తను ఎట్టకేలకు తొలగించారు. కొంగర తండాలోని సమస్యలపై మంగళవారం 'సాక్షి'దినపత్రికలో 'చెత్త'శుద్ధి ఏదీ?'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆదిబట్ల మున్సిపల్ అధికారులు చెత్తను తొలగించారు. దీంతో కొంత ఉపశమనం లభించిందని కొంగర తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు. నిత్యం చెత్త సేకరణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ తప్పడు ప్రచారం మానుకోవాలి

కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను సరిదిద్ది పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలం చూపండి

ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఇంటి పట్టాల లబ్ధిదారులు

కందుకూరు: ఇళ్ల సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల స్థలాల కబ్జా చూపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కందుకూరులో సర్వే నంబర్ 788, 107లో రెండేళ్ల క్రితం 530 మందికి ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. ఇంత వరకు కబ్జా మాత్రం చూపలేదన్నారు. ప్రస్తుతం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం, పేదలకు ఇంటి స్థలం కబ్జా చూపకపోవడం బాధాకరమన్నారు. కబ్జా చూపితే లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. కాగా వారి వద్దకు వచ్చిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి వారం రోజుల్లో స్థలం చదును చేసి ప్లాట్లుగా విభజించడానికి అవసరమైన బడ్జెట్ కోసం కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నాను విరమించి ఆయనకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఎం.ఇందిరమ్మ, శంకరమ్మ, బాలమణి, రామలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

కంచెలు ఏర్పాటు చేయాలని వినతి

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేక ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. – కడ్తాల్



కడ్తాల్ గ్రామర్ స్కూల్ సమీపంలో..



కేశవరెడ్డి గార్డెన్ సమీపంలో..



కెనరాబ్యాంకు సమీపంలో..



మండల విద్యా వనరుల కేంద్రం వద్ద



కృష్ణవేణి పాఠశాల సమీపంలోని మసీద్ వద్ద

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386